క్లుప్తంగా

22 నుంచి విగ్రహ ప్రతిష్ట

కడప కల్చరల్ : కడప నగరం పెద్దబెస్తవీధిలో ఈనెల 22వ తేదీ నుంచి మూడు రోజులపాటు శ్రీ పట్టాభి రామాలయంలో శ్రీ సీతారామలక్ష్మణ హనుమ సమేత పరివార దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ట ఉత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజులు విశేష పూజలు చేపట్టనున్నారు.

శుభ్రతా కార్యక్రమాలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఒక్కరోజు సామూహిక పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి , ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వై.సావిత్రి, డా. జి. విజయలక్ష్మి, సుబ్బనరస్య, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

19న వైఎస్ సిలార్ స్మారక పురస్కారాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రంగస్థల కళాకారుడు, శ్రీ నవ్యకళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ సిలార్ తొలి వర్ధంతి సందర్భంగా ఈనెల 19వ తేదీన స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో స్మారక పురస్కారాలను అందజేయనున్నట్లు నిర్వాహకులు వైఎస్ సాయిబాబా తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు ఎం .వివేకానందరెడ్డి అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష ముఖ్య అతిథిగా, షేక్ హుసేన్ సత్యాగ్ని విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. వివిధ రంగాలలో సమాజానికి సేవలు అందిస్తున్న 30 మంది ప్రముఖులకు వైఎస్ సిలార్ పేరిట ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతునొక్కుతూ ప్రజా సమస్యలను విస్మరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు ఐఎస్ సుబ్బమ్మ, మనోహర్ , రామ్మోహన్ పాల్గొన్నారు.

19, 20న అమ్మవారి ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ అంకాలమ్మ చల్ల బోనాల కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు భక్తులు అమ్మవారికి చల్ల సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు బోనాల సమర్పణ ఉంటుంది.

గంగమ్మ ఆలయంలో..

స్థానిక శంకరాపురం విద్యామందిర్ స్కూలు వద్ద గల శ్రీ గంగాదేవి ఆలయ 21వ వార్షికోత్సవం ఈనెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్నారు. 20న ఉదయం 8.00 గంటలకు బోనాల సమర్పణ, సాయంత్రం 4 గంటలకు శ్రీ పోతురాజు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహిస్తారు. 21న బోనాల సమర్పణ నిర్వహిస్తారు.

24న ఆరాధన

కడప కల్చరల్ : కడప నగరం పాత బస్టాండులోని శ్రీ సద్గురు అవధూతేంద్రస్వామి జ్ఞాన మందిరంలో ఆయన 45వ ఆరాధన మహోత్సవం ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం ఉంటుంది. రాత్రి 7.30 గంటలకు భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

30న శ్రీరామనవమి పూజలు

కడప కల్చరల్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈనెల 30న కడప నగరం చిన్నచౌకు అశోక్‌నగర్‌లోగల శ్రీ కల్యాణ సీతారామ ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తారు.

నెహ్రూనగర్ శ్రీ రామాలయంలో..

రామాలయం నిర్మించి 34 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీ రామ నవమిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు విశేష పూజలు నిర్వహిస్తారు. 30న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

22న శ్రీ కన్యకాంబ సన్నిధిలో ఉగాది

కడప కల్చరల్ : స్థానిక అమ్మవారిశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 22వ తేదీ సాయంత్రం పంచాంగ పఠనం ఏర్పాటు చేశారు. స్థానిక జయనగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అలంకారం నిర్వహించనున్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జూదమాడుతున్న 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రహదారుల విస్తరణకు
రూ.305.51 కోట్లతో అనుమతులు

- గుర్రాలగడ్డ, నాగరాజుపేట వంతెనలు, జంతు వధశాల నిర్మాణాలకు డీపీఆర్‌లు
- నగరపాలక స్టాండింగ్ కమిటీలో తీర్మానాలు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్, క్రిష్టా సర్కిల్-దేవునికడప, మాసాపేట సర్కిల్-బైపాస్ వరకూ, అన్నమయ్య సర్కిల్- గోకుల్ సర్కిల్ వరకూ ఉన్న నాలుగు రోడ్లను విస్తరించేందుకు ప్రభుత్వం రూ.305.51 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని మేయర్ సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కడప కార్పొరేషన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే బుగ్గవంకపై గుర్రాలగడ్డ, నాగరాజుపేటల వద్ద వంతెనలు నిర్మించేందుకు, జంతు వధశాల నిర్మాణానికి డీపీఆర్‌లు తయారు చేయాలని కమిటీ తీర్మానించింది. మాసాపేట సర్కిల్ నుంచి కేసీ కెనాల్ వరకూ రోడ్డు విస్తరణ పనుల్లో డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.65.50లక్షలు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ కార్మికులకు రెండు జతల యూనిఫారం, ఆప్రాన్స్ ఇచ్చేందుకు అనుమతిచ్చారు.

పాత బస్టాండులో 19 షాపు రూములకు సంబంధించి ప్రస్తుతం చెల్లిస్తున్న బాడుగను పెంచేందుకు మూడు రకాల ఆప్షన్లను ఇస్తూ తీర్మానించారు. రిమ్స్ సమీపంలోని జర్నలిస్టు కాలనీ పార్కును రూ.20లక్షలతో అభివృద్ధి చేయాలని, మాసాపేట సర్కిల్ నుంచి పాత డంపింగ్ యార్డు వరకూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కరెంటు స్తంభాలు తొలగించేందుకు మొదటి విడతగా రూ.50 లక్షలు చెల్లించేందుకు అనుమతి మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ కడప నగరపాలక సంస్థకు మంజూరు చేసిన రూ.2.51కోట్లు, రూ.75లక్షల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను వివిధ అభివృద్ధి పనులకు వినియోగించడానికి ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, వి. శిరీష, మేసా ప్రమీలరాణి, షఫీ, హేమలత, సీపీ సంజీవ్ కుమార్, ఈఈ నారాయణ స్వామి, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎజెండాపై చర్చిస్తున్న మేయర్ సురేష్ బాబు తదితరులు

తెలుగువారు గర్వించదగ్గ రచయిత్రి మొల్ల

- వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన

వైవీయూ : రామాయణాన్ని తెలుగువారందరికీ అర్థమయ్యేలా రచించిన కవయిత్రి మొల్ల మనజిల్లా వాసి కావడం మనందరికీ గర్వకారణమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగ జనార్ధన అన్నారు. శుక్రవారం వైవీయూ తెలుగుశాఖ, మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో మొల్ల సప్తశతజయంతి సభ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రతియేటా మొల్ల జయంతిని విశ్వవిద్యాలయం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైఎస్ హయాంలో మొల్ల జయంతికి నిధులు కేటాయించి, అధికారికంగా నిర్వహించారన్నారు. ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష ఉన్నంతకాలం మొల్ల జనంలో జీవించి ఉంటారన్నారు. తెలుగు శాఖ ఆచార్యులు ఎస్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ తేనెరుచిలా మొల్ల రామాయణం ఉంటుందన్నారు. మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్లపేరుతో సమావేశ మందిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తిరుపతికి చెందిన శతావధాని డా. ఆముదాల మురళీ మాట్లాడుతూ 1440 మార్చి 13న కవయిత్రి మొల్ల జన్మించినట్లు కేంద్రప్రభుత్వం గుర్తించి ఆమె పేరుతో స్టాంపు విడుదల చేయడం గొప్ప పరిణామమన్నారు. అవధాని మాడుగుల శివశ్రీశర్మ మాట్లాడుతూ మొల్ల శ్రీకంఠమల్లేశ్వరుని వరం పొందినట్లు వివరించారు. పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ గోపవరంను మొల్ల మండలంగా ప్రకటించాలని కోరారు. అంతకు మునుపు మొల్లమాంబ పేరుతో విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో ఏర్పాటు చేసిన సమావేశ మందిరాన్ని వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆచార్య పి. రమాదేవి, ఆచార్య జి. పార్వతి, డా. ఎం. వినోదిని, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, మొల్లసాహితీ పీఠం ప్రతినిధి పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొల్ల సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని చెమ్ముమియాపేటకు చెందిన వరప్రసాద్ అనే వ్యక్తి తనకు సంబంధించిన మూడు సెంట్ల స్థలాన్ని పేటా నాగరాజు, వై. శ్రీనివాసులుకు రూ.28.50 లక్షలకు విక్రయించాడు. ఈ మొత్తంలో రూ. 12 లక్షల మేరకు డబ్బులను వరప్రసాద్‌కు పై ఇరువురు ఇచ్చారు. మిగిలిన డబ్బులను వరప్రసాద్ వారిని అడుగగా, అతని ఇంటి వద్దకు వెళ్లి కులంపేరుతో దూషించారనిని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాహీర్ హుసేన్ తెలియజేశారు.

కెమెరాల దుకాణంలో చోరీ

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో వున్న స్మార్ట్ కెమెరాల దుకాణం షెట్టర్‌ను మధ్యలోకి కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 16వ తేదీ రాత్రి చోరీకి పాల్పడ్డారు. 27 కెమెరాలను తీసుకుని వెళ్లారని, వాటి విలువ లక్షల్లో వుంటుందని దుకాణదారుడు జమాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు.

ఆర్వో ప్లాంట్ వితరణ

వల్లూరు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి అభయ ఫౌండేషన్, శివశక్తి సంస్థల ఆర్థిక సహకారంతో ఆర్వో ప్లాంట్, రెండు ఇన్‌వర్టర్లను వితరణగా అందజేశారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారి తరుపున మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయకుమార్ చేతుల మీదుగా రూ. 1.50 లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంటుతో పాటు రెండు ఇన్‌వర్టర్లను విద్యాలయ ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నజీమున్నీసా మాట్లాడుతూ అభయ ఫౌండేషన్, శివశక్తి సంస్థల వారు తాగునీటి కోసం 250 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంటును, రెండు ఇన్‌వర్టర్లను వితరణగా ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఆరోగ్య విషయాలపై శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప అర్బన్: ప్రతి తల్లీ, గర్భిణులు ఆరోగ్య విషయాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలియజేశారు. శుక్రవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఏఆర్‌టి సెంటర్‌లో సాథి అండ్ మ్యాన్‌కైండ్ ఫార్మావారి సౌజన్యంతో గర్భిణీలు, తల్లులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మందులు క్రమంగా వేసుకోవాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.కే ఖాదర్‌వల్లి మాట్లాడుతూ ప్రతిరోజూ ఆహారంలో ఆకుకూరలు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అందరూ సమతుల్య ఆహారాన్ని తీసుకుని జీవనశైలిని పెంచుకోవాలని సూచించారు. డీపీఎం వి. భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులు యోగా ఆచరించడం వలన చాలా ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ పి.వి ప్రసాద్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ భాగస్వామ్య ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ (సాథి)టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులందరూ పాల్గొని తల్లులకు, గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేయడంతో పాటు, వారికి సలహాలు,సూచనలు చేయడం అభినందనీయమన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


పూజా కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరం 1వ డివిజన్‌లోని వాటర్ గండిలో సీతారామాలయ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో శ్రీ వాణీ కమిటీ, సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో నిర్మించిన దేవాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, రాజా జ్యువెలర్స్ అధినేత జరుగు రాజశేఖర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై హోమంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున కిరణ్ పాల్గొన్నారు.

అక్రమ గృహ నిర్మాణదారులకు నోటీసులు

కడప కార్పొరేషన్: లే అవుట్లలో అక్రమంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 40వ డివిజన్ చౌటపల్లె, ఎస్‌బీఐ కాలనీల్లో ఆయన పర్యటించారు. కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి సెట్‌బ్యాక్స్, ప్లాన్లు పరిశీలించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. రెడ్డి కాలనీ నుంచి రైల్వే గేట్ వరకూ కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తీసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌బీఐ కాలనీలోని పార్కులో చిన్నారులు ఆడుకొనుటకు ఎక్కువ స్థలం ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం జర్నలిస్టు కాలనీ పార్కును పరిశీలించి ఓపెన్ జిమ్, ప్లాట్‌ఫారమ్ మరమ్మతులు చేయించాలన్నారు. గాంధీ పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు.


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

- గురువారం రాత్రి భారీ వర్షం కురిసిన నేపథ్యంలో రాత్రి 9.30 గంటలకు ఆయన నగరంలో పలు ప్రాంతాలను పరిశీలించి వర్షపునీరు ఎక్కడా నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కమలాపురం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన భారీ గాలులకు 9 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గంగవరంలో 4, లేటపల్లెలో 1, సముద్రంపల్లె, పి.కొత్తపల్లెలో మరో 4 విద్యుత్ స్తంబాలు విరిగి పడ్డాయని, దాదాపు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యాసాగర్ తెలిపారు. పడిపోయిన స్తంబాల స్థానాల్లో కొత్త విద్యుత్ స్తంబాలు త్వరితగతిన ఏర్పాటు చేస్తామని, ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

జలమయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో రోడ్డుపై వాన నీరు నిల్వ ఉంది. ఈ వర్షపు నీటి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్టాండు అవుట్ గేట్ వద్ద శుక్రవారం రాత్రి నాటికి కూడా ప్రధాన రహదారిపై వర్షపు నీరు అలాగే నిలబడడంతో బస్టాండుకు వచ్చే ప్రయాణీకులు, వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రాంతంలో వర్షపు నీరు నిలబడకుండా చూడాలని కోరుతున్నారు.



మృత్యుంజయేశ్వరుడి హుండీ సొమ్ము లెక్కింపు



కడప కల్చరల్ : స్థానిక మృత్యుంజయకుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. 2022 నవంబరు 22 నుంచి నేటి వరకు ఆలయ హుండీ ద్వారా రూ. 1,03,436 లభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సతీష్, శశిధర్, దక్షిణామూర్తి, సిబ్బంది సూర్యనారాయణ, జీవీ శ్రీధర్, శివసాయిప్రసాద్, కేవీఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాతరిమ్స్ ఆటోస్టాండ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా

కడప కార్పొరేషన్: పాతరిమ్స్ లగేజి ఆటో స్టాండ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, నగర లగేజ్ ఆటోస్టాండ్ అధ్యక్షుడిగా రవిని నియమించినట్లు వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా, నగర అధ్యక్షుడు ఏ1నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆటో స్టాండ్ సమావేశం నిర్వహించి వారిని బ్యాలెట్ ఓటు ద్వారా వారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నడుచుకుంటూ పార్టీకి, యూనియన్‌కు మంచిపేరు తేవాలని సూచించారు. తద్వారా కడపలో వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈనెల 28వ తేది నిర్వహించే వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహా, దస్తగిరి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో రక్తహీనత దూరం

వల్లూరు : నులి పురుగులను నివారించడం వలన రక్త హీనత దూరమవుతుందని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని 5 నెలలు నిండిన గర్భిణులకు శుక్రవారం ఆయన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని టీబీ పేషంట్ల గృహాలను సందర్శించి పలు సూచనలు ఇచ్చారు.

డీఈఓకు అభినందన వెల్లువ


డీఈఓను సన్మానిస్తున్న వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డికి అభినందన వెల్లువ సాగింది. సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణలు డీఈఓను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌టీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నేతలతోపాటు డీఈఓ కార్యాలయ ఏడీలు దేవరాజు, మునీర్‌ఖాన్, పలు సెక్షన్ల సూపరింటెండెంట్లు, పలు మండలాల ఎంఈఓలు కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

కంటి పరీక్షలు



కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులకు శుక్రవారం ఎన్ఎస్ఎస్ తరుపున ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సంబంధిత వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్తిఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు మొహమ్మద్ ఆసిఫ్‌ఖాన్ పలువురు విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హకీముద్దీన్ అహ్మద్, మీర్జా విలయత్ అలీబేగ్, ఆసాప్ కోహ్లీ, అబ్దుల్‌ఖావీ, పోగ్రాం కో ఆర్డినేటర్ మొహమ్మద్ ఖాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కాయపల్లె అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ


అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

కడప రూరల్ : కడప నగరం అక్కాయపల్లె అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎన్ఎంసీ ఇన్‌స్పెక్షన్ కమ్యూనిటీ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ బెనర్జీ, డాక్టర్ సురేష్, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, గుల్జార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్(30 రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల లోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. మార్చి 20వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుందని, ఆసక్తి గల వారు తిరుపతి రోడ్డులో గరల్స్ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9440905478, 6302833546 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఆర్థిక సాయం

కడప కార్పొరేషన్: మానసిక వ్యాధిని జయించిన యువతి వివాహానికి రక్షణ స్వచ్ఛంద సంస్థ, జై భీమ్ మాలమహాసేన ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. శనివారం స్థానిక అల్‌షిఫా మానసిక వికాలాంగుల పునరావాస కేంద్రంలో నిర్వాహకులు రఫీ అభ్యర్థన మేరకు మానసిక వ్యాధిని జయించిన లావణ్య అనే అమ్మాయి వివాహానికి కొత్త దుస్తుల నిమిత్తం వారు ఈ సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కడప మార్కెట్‌యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్, సోషల్‌వెల్ఫేర్ వార్డెన్ పి. జగన్‌మోహన్, రక్షణ సభ్యులు జె. శాంతకుమారి, అమృత, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు చైతన్య పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కడప వైఎస్సార్ సర్కిల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. వెంకట శివ పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండు కాంప్లెక్స్ వద్ద నిలిచిన మురుగు, వర్షపు నీటిని సీపీఐ నాయకులు పరిశీలించారు. సీపీఐ నాయకులు మద్దిలేటి, మనోహర్ రెడ్డి, గంగా సురేష్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

యానాదయ్య సేవలు మరువలేనివి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న మారెళ్ల యానాదయ్య సేవలు మరువలేనివని కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డి తెలిపారు. శనివారం కడప రైల్వేస్టేషన్‌లో బదిలీపై వెళుతున్న యానాదయ్యకు బదిలీ ఉత్తర్వులను అందజేశారు. ప్రస్తుతం భారతి సిమెంటు కమర్షియల్ సూపర్‌వైజర్‌గా బదిలీపై వెళుతున్న ఆయనను రైల్వే అధికారులు అభినందించారు. అనంతరం యానాదయ్య మాట్లాడుతూ అందరి సహకారంతో విధి నిర్వహణలో ఉన్నత అధికారుల మన్ననలు పొందగలిగానని తెలిపారు. తనకు ఇచ్చిన సహకారమే కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జనార్ధన్‌కు అందించాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు యానాదయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమ అప్రెంటిస్ యాక్టును నిర్లక్ష్యం చేయరాదు

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు అప్రెంటిస్ యాక్టును అమలు చేయడంలో నిర్లక్ష్యం చేయరాదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1961 అప్రెంటిస్ యాక్టు ప్రకారం ఏదైనా పరిశ్రమల్లో ప్రతి ఏడు మంది కార్మికులకు ఒకరిని అప్రెంటిస్ హోల్డర్‌ను తీసుకోవాల్సి ఉండగా విద్యుత్ సంస్థలలో, పరిశ్రమలలో తీసుకోవడం లేదన్నారు.

నిరుద్యోగ యువత ఉపాధికి తోడ్పాటు అందించాలి

– ఎన్ఐఆర్‌డీ ప్రాజెక్టు ఆఫీసర్ పవన్‌కుమార్



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న పవన్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో డీడీయూ, జీకేవై పథకం ద్వారా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీ) ప్రాజెక్టు ఆఫీసర్ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులకు అందిన జాబ్ ఆఫర్ లెటర్లను ఆయన పరిశీలించారు. తర్వాత విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాన్ని పరిశీలించారు. అలాగే నిహార్ స్కిల్ నిర్వాహకులు, ఫ్యాకల్టీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ ఇంతియాజ్ అహ్మద్, ప్రతినిధులు సుబ్బరామిరెడ్డి, తేజ, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్‌లు మహా మంగళ సూత్రాలను భక్తులకు దర్శింపజేసి స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితోపాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గంధం కలశాన్ని తీసుకున్న వస్తున్న పీఠాధిపతి

భక్తిశ్రద్ధలతో షహమీరియా దర్గా ఉరుసు

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని అస్తానె షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. దర్గాలోని హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ హఖ్ ఉరఫ్ షహమీర్ బాష సాహెబ్ చిష్తివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలలో భాగంగా రాత్రి అస్తానె షహమీరియా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా హుసేనీబాష షహమీరియా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత తన ఇంటినుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాలు, బ్యాండు మేళాల మధ్య దర్గా వద్దకు చేర్చారు. దర్గా గురువుల మజార్ వద్ద పూలచాదర్ సమర్పించి ఫాతెహా చేసి గంధం సమర్పించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పనులను పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రామరాజుపల్లె, ఎన్‌జీవో కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీల్లో నిర్మిస్తున్న యూహెచ్‌సీలను పరిశీలించారు. సంధ్యా సర్కిల్‌లో జరుగుతున్న ఫుట్‌పాత్ పనులను పరిశీలించి ప్రజలు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాయచోటి రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి పార్కు నిర్మాణ పనుల్లో టాయ్‌లెట్లు, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో కోరారు. వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త స్వీకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి, పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువుల తయారీ వంటి వాటిలో కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 23వ తేదీలోపు తమ దరఖాస్తులను నగరపాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎంపికైన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. వివరాల కోసం పి. వినయ్ కుమార్, సెల్ 8096871406 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

మేయర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించినందుకు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్... ఎంవీ రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామలక్ష్మణ్ రెడ్డి, మల్లికార్జున, కిరణ్, ఎల్లారెడ్డి, పాపన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఘన సత్కారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ఘనంగా సన్మానించారు. శనివారం ఐటీఐ సర్కిల్ సమీపంలోని ఆయన కార్యాలయానికి వెళ్లి శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి శనివారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిని నగరంలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్సీని ఆర్టీసీ చైర్మన్ సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మేయర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

రాత్రి 12 వరకు హోటల్స్‌కు అనుమతి ఇవ్వండి

కడప అర్బన్/ కడప కల్చరల్: కడప ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కడప హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ వారు కలిసి సమస్యలను విన్నవించారు. ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రషీద్‌ఖాన్, హోటల్స్ వారు ఎస్పీని కలిసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. హోటల్స్‌కు రాత్రి 10:30 గంటల వరకు వున్న అనుమతి సమయాన్ని పవిత్ర రంజాన్ నెల సందర్భంగా రాత్రి 12 గంటల వరకు హోటల్స్ తెరిచేలా చూడాలనీ, సాధారణ సమయంలో 11 గంటల వరకు వుండేలా చూడాలని విన్నవించినట్లు తెలియజేశారు. ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలియజేశారు. కడప హోటల్స్ అండ్ ఫుడ్ అసోసియేషన్ సెక్రటరీ ఎం. నవీన్, జాయింట్ సెక్రటరీలు షేక్ ఫరూక్, రెడ్డిబాబు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అర్చకులకు టీటీడీ పంచాంగాలు

కడప కల్చరల్: అర్చకులకు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ టీటీడీ ప్రచురించిన పంచాంగాలు ఉచితంగా పంపిణీ చేశారు. విశేష ఆదరణ గల టీటీడీ పంచాంగాలు సంవత్సరమంతా అర్చకులకు ఎంతో ఉపయోగపడగలవని విజయ్‌భట్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అర్చక, పురోహితులు ఎవరికైనా పంచాంగం అవసరమైతే 99490 22141 నెంబరులో సంప్రదించాలన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కమలాపురం : పట్టణంలోని శ్రీలక్ష్మీ దుర్గ డ్రైవింగ్ స్కూల్ వద్ద సోమవారం అభయ ఫౌండేషన్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందని, స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు. భోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ వారి పర్యవేక్షణలో ఈ శిబిరం కొనసాగు తుందన్నారు.

ఆలయానికి హుండీ వితరణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయానికి పులివెందుల మండలం పెద్దరంగాపురం గ్రామానికి చెందిన దాతలు వెన్నపూస గంగిరెడ్డి, రామసుబ్బమ్మ దంపతులు రూ.35 వేలు విలువ చేసే హుండీని వితరణగా శనివారం ఆలయంలో ఈఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డికి అందజేశారు.

22న భూమి పూజ

చెన్నూరు : స్థానిక లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి (కోట్లస్వామి) దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయం సమీపంలో దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదాల కేసుల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్



పాల్గొన్న పోలీసు, రోడ్డు రవాణా, ఆర్టీసీ అధికారులు, న్యాయవాదులు

– జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్

కడప అర్బన్: రోడ్డు ప్రమాదాల కేసుల్లో ప్రస్తుతం సవరించిన నిబంధనలను పాటించాలని ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాసదన్‌లో పోలీసు, రోడ్డు రవాణా, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రమాదాలు జరిగినపుడు తీసుకునే చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిఎల్‌ఎస్‌ఏ ఇన్‌ఛార్జ్ చైర్మన్ జి. గీత, డీఎల్ఎస్ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మోటారు వాహన సవరణ చట్టం, మోటార్ వాహన సవరణ నియమాలు–2022 లోని అధ్యాయాలు, 11,12లోని నిబంధనలు, ఉచిత న్యాయసహాయం, రోడ్డు ప్రమాదాల కేసుల్లో పాటించాల్సిన నియమాలు తదితర అంశాలను వివరించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, ప్రభుత్వ ప్లీడరు శివశంకర్‌రెడ్డి, న్యాయవాదులతో పాటు, పోలీసు అధికారులు, రోడ్ రవాణా సంస్థ అధికారులు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికలను రెఫరెండంగా పరిగణించలేం

కడప కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికలను రాబోయే సార్వత్రిక ఎన్నికలకు రెఫరెండంగా పరిగణించలేమని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు పాకా సురేష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక కార్పొరేషన్ సమీపంలోని తన కార్యాలయంలో 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, మాజీ కార్పొరేటర్ చైతన్యలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తొమ్మిది జిల్లాలలో 9 లక్షల మంది ఓటర్లు మాత్రమే ఓట్లు వేశారని, దీన్ని ప్రజా వ్యతిరేకతగా చూడలేమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే చంద్రబాబు నాయుడుగానీ, అచ్చెన్నాయుడుగానీ తమ పదవులకు రాజీనామా చేసి గెలిచే సత్తా ఉందా అని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న పాకా సురేష్

ప్రారంభమైన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలోని చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను పూర్తి చేశారు. జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థానానికి ఎదిగి సమాజ సేవకు కృషి చేయాలని నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి, జేసీ సాయికాంత్‌వర్మలు పేర్కొన్నారు. శనివారం కడపలోని నాగార్జున మోడల్ స్కూల్లో ఫెస్టివ్ 2కె23 పేరిట పాఠశాల వార్షికోత్సవాన్ని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ నాగార్జున మోడల్ స్కూల్ 30 సంవత్సరాలుగా అనేక మంది విద్యార్థులకు విద్యావంతులుగా తీర్చిదిద్దిందన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్షం అన్నట్లుగా విద్యార్థులు కూడా కృషి, దీక్ష, పట్టుదలతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాల పూర్వ విద్యార్థినేనన్నారు. తాను ఉన్నత విద్యసభ్యసించి మళ్లీ అదే పాఠశాలకు ఐఏఎస్ అధికారిగా వార్షికోత్సవ వేడుకలకు అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అపజయాలు ఎదురైనా వెనుకంజ వేయకుండా లక్ష్య సాధనలో అలు పెరగని కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కుళ్లాయప్ప, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న జేసీ సాయికాంత్‌వర్మ

ఉత్తమ గ్రేడ్ సాధనకు కృషి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తమ గ్రేడును సాధించేందుకు కష్టపడి చదవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదవాలన్నారు. చదువు ఒక్కటే మనకు గుర్తింపు తెస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందచేశారు. కడప ఎంఈఓ పాలెం నారాయణ, సీకెదిన్నె ఎంఈఓ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందచేస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి

యోగ శిక్షణతో విజయసాధన

కడప కల్చరల్ : యోగా శిక్షణ పొందిన వారికి విజయం సాధించడం సులభమవుతుందని యోగా సాధకులు, విశ్వాత్మ పిరమిడ్ మెడిటేషన్ అండ్ యోగా సెంటర్ నిర్వాహకులు ఆచార్య వీవీఎస్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక రిమ్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో యోగా, ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమగిరి కుమారి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మాధవి పాల్గొన్నారు.

300 పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న మురళీకృష్ణ, కైలాస్

కడప కల్చరల్ : కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మరో 300 పుస్తకాలు అందాయి. అనంతపురంలో ప్రభుత్వ వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ సి.హరికృష్ణకు చెందిన 300 విలువైన మెడికల్, పోటీ పరీక్షల పుస్తకాలను శనివారం ఆయన తండ్రి, మూర్తి ఫోటో స్టూడియో అధినేత సి.మురళీకృష్ణ, కైలాస్ సాగర్‌తో కలిసి బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి అందజేశారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకు పల్లె నిద్ర



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు పల్లె నిద్ర కార్యక్రమం చేపడుతున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు తెలిపారు. శనివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన అన్నమయ్య జిల్లాలోని పీలేరు నుంచి పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ పెద్దపల్లి శేఖర్, జీపీఎల్‌టీ 20 స్పాన్సర్ కోలా ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ – ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షునిగా ఎదురూరి బాబు, కార్యదర్శిగా కొట్టం సుబ్బారావు, రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా మేకల ఆంజనేయులు, ఏపీ ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులుగా పూసపాటి వెంకట నవీన్‌ను ఎన్నుకున్నారు.

సేవకులకు సత్కారం



స్వచ్ఛంద సేవకురాలిని సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రగతి ఫౌండేషన్ జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా స్త్రీ శక్తి మహిళా మండలి సేవలకు ప్రత్యేకంగా గౌరవం లభించింది. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన సంస్థ ప్రతినిధులు ఈ పురస్కారాలు అందుకున్నారు. ఏపీ మహిళా చైర్ పర్సన్ డాక్టర్ సమీర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రగతి ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ ఆరీఫుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడప అగ్నిమాపక శాఖ ఎస్ఐ షంషీర్, కెతుర, సీఆర్‌వీ ప్రసాద్, కంబదూరి నబీరసూల్, అమృతవల్లీ, అర్చన, జ్యోతి లియాకుమారి, పి.రామకృష్ణారెడ్డి, పుట్టా శివారెడ్డితోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉద్యమానికి సహకరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేయిచేయి కలుపుదాం ఉద్యమానికి ఉద్యోగులందరూ సహకరించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోరారు. శనివారు వారు కడప నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమోహన్, రాష్ట్ర అధ్యక్షులు చంటి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.